ప్రజాశక్తి
బుధవారం 5 జూన్ 2024 1
అనంతపురం శ్రీ సత్యసాయి





అనంతపురం

దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ (టిడిపి)

తాడిపత్రి

జెసి.అస్మిత్‌రెడ్డి (టిడిపి)

శింగనమల


బండారు శ్రావణిశ్రీ (టిడిపి)

ఉరవకొండ

పయ్యావుల కేశవ్ (టిడిపి)

గుంతకల్లు

గుమ్మనూరు జయరాం (టిడిపి)

కళ్యాణదుర్గం

అమిలినేని సురేంద్రబాబు (టిడిపి)

రాయదుర్గం

కాలవ శ్రీనివాసులు (టిడిపి)

రాప్తాడు

పరిటాల సునీత (టిడిపి)



కూటమి 'ఫుల్' జోష్..!



- ఉమ్మడి జిల్లాలో 14 సీట్లూ కైవసం
- 13 స్థానాల్లో టిడిపి, ఒక స్థానంలో బిజెపి గెలుపు
- చతికిల పడ్డ వైసిపి
- ఒక్క సీటూ గెలవని వైనం
- మిన్నంటిన తమ్ముళ్ల సంబరాలు
- బాలకృష్ణ హ్యాట్రిక్
- ఉరవకొండ సెంటిమెంట్ బద్దలు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో తెలుగుదేశం కూటమి హై స్పీడ్‌తో దూసుకెళ్లింది. 14 స్థానాల్లోనూ గెలుపొంది తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. జిల్లాలో ఎప్పుడూ లేని విధంగా క్లీన్ స్వీప్ సాధించి ప్రత్యర్థి పార్టీకి చుక్కలు చూపించింది. అధికార వైసిపి కనీసం ఒక్క స్థానాన్ని కూడా నిలుపుకోలేక చతికిలపడింది. ఎన్నికల ముందు వరకు తమ గెలుపునకు తిరుగులేదని బీరాలు పలికన వైసిపి నేతలందరూ ఓటమిని చవిచూశారు. 2019 ఎన్నికల్లో 12 స్థానాల్లో గెలుపొంది తిరుగులేని పార్టీగా ఎదిగిన వైసిపి 2024 వచ్చే సరికి తన ప్రాభవాన్ని పూర్తిగా కోల్పోయింది. అనుకున్న దానికంటే ఎక్కువగా ఫలితాలు రావడంతో టిడిపి శ్రేణుల్లో ఫుల్‌జోష్ నెలకొంది. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా తమ్ముళ్ల సంబరాలు మిన్నంటాయి. ఇక అధికార వైసిపి కార్యాలయాలు నిర్మానుష్యంగా మారాయి.


జెఎన్‌టియులో లెక్కింపులో పాల్గొన్న కౌంటింగ్ సిబ్బంది

ప్రజాశక్తి–అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో సైకిల్ క్లీన్‌స్వీప్ చేసింది. అసెంబ్లీ పార్లమెంటు రెండింటిలోనూ కూటమే విజయం సాధించింది. ఒక్కటంటే..ఒక్క స్థానాన్ని కూడా వైసిపి దక్కించుకోలేకపోయింది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో 12 అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాలను దక్కించుకున్న వైసిపి ఈసారీ జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఘోర ఓటమిని చవి చూసింది.


రాయదుర్గంలో టిడిపి సంబరాలు

సంక్షేమ పథకాలు తమను గట్టెక్కిస్తాయని నమ్మకుంటూ వచ్చిన వైసిపి నేతలకు ఫలితాలు చూసి నివ్వెరబోయే పరిస్థితి నెలకొంది. చాలా మంది వైసిపి నేతలు కౌంటింగ్ పూర్తవకుండానే నిరాశతో మధ్యలోనే వెనుదిరిగారు. మంగళవారం ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమైన ఓట్ల లెక్కింపు రాత్రి వరకు కొనసాగింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొదటి ఫలితం ఉరవకొండ నియోజకవర్గం వచ్చింది. ఆ తరువాత వరుసగా ఒకదాని తరువాత ఒకటి వస్తూ వచ్చాయి. ఈ ఫలితాలను అన్నింటిలోనూ టిడిపి విజయం సాధిస్తూ వచ్చింది.

ఐదు నియోజకవర్గాల్లో హోరాహోరీ

ఉమ్మడి అనంతపురం జిల్లలో ఐదు నియోజకవర్గాల్లో ఓట్ల లెక్కింపు ఫలితాలు హోరాహోరీగా సాగాయి. కొన్ని రౌండ్లలో టిడిపికి ఆధిక్యత వస్తే మరికొన్ని రౌండ్లలో వైసిపికి వస్తూ వచ్చాయి. ఈ రకంగా గుంతకల్లు, మడకశిర, కదిరి, పుట్టపర్తి, ధర్మవరం నియోజకవర్గ ఫలితాలు ఒకసారి టిడిపి, ఒకసారి వైసిపి అన్నట్టుగా మారుతూ వచ్చాయి. చివరి రౌండ్లలో టిడిపియే ఆధిక్యతను సాధించింది. 14 అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాల్లోనూ టిడిపి విజయం సాధించింది. గతంలో ఎన్నడూలేని విధంగా అన్ని స్థానాలను టిడిపి దక్కించుకుంది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో 12 స్థానాలను ,రెండు పార్లమెంటు స్థానాల్లో విజయం సాధించిన వైసిపి ఈ

మిగతా 3లో

హిందూపురం


నందమూరి బాలకృష్ణ (టిడిపి)

మడకశిర

ఎంఎస్.రాజు (టిడిపి)

పెనుకొండ

సవితమ్మ (టిడిపి)

పుట్టపర్తి

పల్లె సింధూర (టిడిపి)

కదిరి


కందికుంట వెంకటప్రసాద్ (టిడిపి)

ధర్మవరం

సత్యకుమార్ యాదవ్ (బిజెపి)

అనంతపురం (ఎంపి)

అంబికా లక్ష్మీనారాయణ (టిడిపి)

హిందూపురం (ఎంపి)

బికె.పార్థసారథి (బిజెపి)

నియోజకవర్గాలు..గెలుపు... మెజార్టీలు 5లో..

ప్రారంభం నుంచే ఆధిక్యం

కూటమి అభ్యర్థులను వరించిన విజయాలు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా కూటమి అభ్యర్థులు స్పష్టమైన మెజార్టీతో ముందుకు సాగారు. నియోజకవర్గాల్లో ఓట్ల లెక్కింపు ప్రారంబమైనప్పటి నుంచి టిడిపి అభ్యర్థులు ఆధికత్యను ప్రదర్శిస్తూ వచ్చారు. నియోజకవర్గాల వారీగా చూస్తే రాయదుర్గం టిడిపి అభ్యర్థి కాలవ శ్రీనివాసులు వైసిపి అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డిపై ప్రారంభం నుంచే ఆదికత్యలో కొనసాగుతూ వచ్చారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యే సరికి కాలవ శ్రీనివాసులకు 41.659 ఓట్ల మెజార్టీ లభించింది. 2014లో తొలిసారిగా ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందాక కాలవ శ్రీనివాసులు మంత్రి కూడా అయ్యారు. 2019లో తిరిగి అక్కడి నుంచే పోటీ చేసి ఓటమి చెందారు. ఇప్పుడు రెండవసారి ఎమ్మెల్యే రాయదుర్గం నుంచే పోటీ చేసి గెలుపొందారు.

5వ సారి పయ్యావుల కేశవ్..

ఉరవకొండ అసెంబ్లీ నియోజకవర్గంలో పయ్యావుల కేశవ్ ఐదవసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1994లో పోటీ చేసి తొలిసారిగి గెలుపొందారు. 1999లో పోటీ చేసి వై.శివరామిరెడ్డి చేతిలో ఓటమి చెందారు. ఆ తరువాత 2004లోనూ, 2009లో వరుసగా గెలుపొందారు. తిరిగి 2014లో వై.విశ్వేశ్వరరరెడ్డి చేతిలో ఓటమి చెందారు. 2019లో వై.విశ్వేశ్వరరెడ్డిపై గెలుపొందారు. ప్రస్తుతం మరో మారు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. మొత్తంగా

మిగతా 3లో



ఏజెంట్లతో కలిసి కౌంటింగ్ కేంద్రానికి వెళ్తున్న సవితమ్మ

పెను'కొండ'పై ఎగిరిన టిడిపి జెండా

భారీ మెజారిటీతో సవితమ్మ విజయం

ప్రజాశక్తి-సోమందేపల్లి

గతంలో టిడిపికి కంచుకోటగా ఉన్న పెనుకొండ నియోజకవర్గాన్ని ఈ ఎన్నికల్లో తిరిగి టిడిపి కైవసం చేసుకుంది. సార్వత్రిక ఎన్నికల్లో పెనుకొండ నియోజకవర్గంలో టిడిపి అభ్యర్థిగా పోటీ చేసిన ఎస్.సవితమ్మ భారీ మెజారిటీతో విజయం సాధించారు. మంగళ వారం జరిగిన కౌంటింగ్‌లో వైసిపి అభ్యర్థి, రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్‌పై 33,629 ఓట్లతో సవితమ్మ గెలుపొందగా పెనుకొండ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి అపూర్వభరత్ ఆమెకు డిక్లరేషన్ అందజేశారు. సవితమ్మ గెలుపుతో నియోజకవర్గంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న సత్యకుమార్‌యాదవ్

ధర్మవరం ప్రజలకు రుణపడి ఉంటా

సత్యకుమార్‌యదవ్

ధర్మవరం టౌన్ : అనతి కాలంలోనే తనను ఆదరించి గెలిపించిన ధర్మవరం నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉండట మే కాకుండా వారి రుణం తీర్చుకుంటానని ధర్మవరం ఎమ్మెల్యేగా విజయం సాదించిన సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. విజయానంతరం కౌంటింగ్ హాల్ నుంచి బయటకు వచ్చిన సత్యకుమార్యాదవ్ విలేఖరులతో మాట్లాడారు. రాష్ట్రంలో వైసీపీ అరాచక, అవినీతి పాలనకు వ్యతిరేకంగా ప్రజలు ఓటు అనే ఆయుధంతో తగిన బుద్ధి చెప్పారన్నారు. దివాళా తీసిన ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో నడిపించే సత్తా రాష్ట్రంలో చంద్రబాబుకు కేంద్రంలో నరేంద్రమోడీకి ఉందన్నారు.

ధర్మవరంలో బిజెపి పాగా

ధర్మవరంలో మొదటి సారి బిజెపి పాగా వేసింది. టీడీపీ, జనసేన, బీజేపీ తరపున పోటీ చేసిన సత్యకుమార్ యాదవ్ విజయరే సాధించారు. 50ఏళ్ల తరువాత ధర్మవరానికి బీసీ సామాజికవర్గానికి చెందిన ఎమ్మెల్యే అయ్యారు. ధర్మవరం నియోజకవర్గం ఏర్పడిన తరువాత ఒక్కసారి మాత్రమే బీసీ అభ్యర్థికి అవకాశం ఇవ్వగా అందులో పోటీ చేసిన పల్లెం వెంకటేశ్ విజయం సాధించారు.

పుట్టపర్తి 'పల్లె'దే

9,870 ఓట్ల మెజార్టీతో సింధూర విజయం

పుట్టపర్తి అర్బన్ : మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి కోడలు టిడిపి అభ్యర్థి పల్లె సింధూర రెడ్డి వైసిపి అభ్యర్థి దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిపై 9870 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. లేపాక్షి సమీపంలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలో జరిగిన ఓట్ల లెక్కింపులో 14 రౌండ్ల వరకు నువ్వా నేనా అన్నట్లు ఫలితాలు వెలువడ్డాయి. మరో 4 రౌండ్లలో పల్లె సింధూర స్పష్టమైన మెజార్టీ వచ్చింది. ఆమెకు మొత్తం 90, 173, వైసీపీ అభ్యర్థి దుద్దుకుంట శ్రీధర్ రెడ్డికి 82,216 ఓట్లు వచ్చాయి. పోస్టల్ బ్యాలెట్‌లో టిడిపి అభ్యర్థికి 1568 ఓట్లు రాగా వైసిపి అభ్యర్థికి 765 ఓట్లు వచ్చాయి. మొత్తం మీద 9870 ఓట్లతో టిడిపి అభ్యర్థి విజయం సాధించారు. పల్లె సింధూర రెడ్డి తొలిసారిగా అసెంబ్లీలోకి అడుగుపెట్ట నుంది. నియోజక వర్గ వ్యాప్తంగా టిడిపి శ్రేణులు బాణాసచ్చా కాల్చి సంబరాలు చేసుకు న్నారు. ఇలా ఉండగా కాంగ్రెస్ అభ్యర్థి దాదిరెడ్డి మధుసూదన్ రెడ్డి 1977 ఓట్లు సాధించగా బహుజన పార్టీ అభ్యర్థి 3805 ఓట్లు సాధించారు. మరో పదిమంది స్వతం త్రులు, ఇతరులు మూడంకెలు దాటి ఓట్లు సాధించలేకపోయారు.



హిందూపురంలో బాలయ్య నివాసంలో స్వీట్ తినిపిస్తున్న అభిమాని

'పుర'ంలో బాలయ్య హ్యాట్రిక్ విజయం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గంలో సినీ నటుడు నందమూరి బాలకృష్ణ వరుసగా మూడోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టారు. బాలకృష్ణ తన సమీప వైసిపి అభ్యర్థి టిఎన్ దీపికపై 32, 597 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. మొదటి రౌండ్ నుంచి వరుసగా ఎనిమిది రౌండ్ల వరకు బాలకృష్ణ ఆధిక్యంతో ఉన్నారు. 9వ రౌండ్ లో వైసిపి అభ్యర్థి దీపిక 520 ఓట్ల ఆధిక్యం సాధించినప్పటికీ 10వ రౌండ్ నుంచి 19వ రౌండ్ వరకు బాలకృష్ణ ప్రతి రౌండ్‌లోను ముందంజలో నిలిచారు. హిందూపురం నియోజక వర్గంలో మొత్తం 2,49,174 ఓట్లు ఉండగా 1,93, 905 ఓట్లు పోలయ్యాయి. ఇందులో కాంగ్రెస్ అభ్యర్థి ఇనాయతుల్లాకు 8894 ఓట్లు, వైసిపి అభ్యర్థికి 74653, టిడిపి అభ్యర్థి బాలకృష్ణకు 1,07,250 ఓట్లు వచ్చాయి. దీంతో బాలకృష్ణ 32,597 ఓట్లతో విజయం సాధించారు. రాష్ట్ర వ్యాప్తంగా టిడిపి విజయ డంకా మోగించడంతో బాలకృష్ణ హిందూపురం నుంచి మంగళగిరికి వెళ్లారు. బాలకృష్ణ తరపున మాజీ మున్సిపల్ చైర్మన్ అనిల్‌కుమార్ బాలకృష్ణ గెలుపు ధ్రువీకరణ పత్రాన్ని నియోజక వర్గ ఎన్నికల అధికారి అభిషేక్ కుమార్ చేతుల మీదుగా అందుకున్నారు.

బాలయ్య నివాసంలో సంబరాలు

హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ హ్యాట్రిక్ విజయం సాధించడంతో మంగళవారం బాలయ్య నివాసం వద్ద బాలయ్య అభిమానులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. టిడిపి జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజినప్ప, పట్టణ అధ్యక్షులు రమేష్ కుమార్ తదితర నాయకుల సమక్షంలో బాలకృష్ణ కేక్ కట్ చేశారు. తన నివాసం వద్దకు వచ్చిన అభిమానులు, టిడిపి నాయకులు, కార్యకర్తలకు బాలయ్య కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గ కో ఆర్డినేటర్ శ్రీనివాస రావు, డాక్టర్ సురేంద్ర, జెఈ వెంకట స్వామి, పెద్ద ఎత్తున బాలయ్య అభిమానులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మడకశిర కౌంటింగ్‌లో ఉత్కంఠ

టిడిపిదే పైచేయి

స్వల్ప మెజారిటీతో గట్టెక్కిన ఎంఎస్. రాజు

ప్రజాశక్తి-మడకశిర



సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మంగళవారం హిందూపురంలోని బిట్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన కౌంటింగ్ ప్రక్రియలో మడకశిర నియోజకవర్గ ఎన్నికల ఓట్ల లెక్కింపు చివరి వరకూ ఉత్కంఠ భరితంగా సాగింది. మొదటి రౌండ్ నుంచి దోబూచులాడి చివరకు టిడిపి అభ్యర్థి ఎంఎస్ రాజునే 25 ఓట్లతో విజయం వరించింది. టిడిపి అభ్యర్థి ఎంఎస్ రాజుకు 78,347 ఓట్లు రాగా, వైసిపి అభ్యర్థి ఈరలక్కప్పకు 78,322 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి కె.సుధాకర్‌కు 15,000 ఓట్లు పడ్డాయి. ముందు నుంచి నియోజకవర్గంలో వైసిపి, టిడిపి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఈరలక్కప్ప, ఎంఎస్.రాజు, కె.సుధాకర్ తీవ్రంగా పోటీపడ్డారు. అయితే మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తన చాకచక్యంతో చక్రం తిప్పి నియోజకవర్గంలో టిడిపి విజయానికి తీవ్రంగా కృషి చేశారని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. ముందుగా మాజీ ఎమ్మెల్యే ఈరన్న తనయుడు డాక్టర్ సునీల్ కుమార్‌కు టికెట్ కేటాయించారు. అయితే చివరి నిమిషంలో అధినేత చంద్రబాబు అనూహ్యంగా ఎంఎస్ రాజును అభ్యర్థిగా ప్రకటించడంతో ఆయన సుడిగాలి పర్యటన చేపట్టారు. సమయం తక్కువ ఉన్నా తనదైన శైలిలో నియోజకవర్గ టిడిపి నాయకులతో కలిసి మెలిసి 5 మండలాల్లో విస్తృతంగా ప్రచారం చేపట్టి ఓటర్లను తన వైపు తిప్పుకోవడంలో కృతకృత్యులయ్యారు.

విజయోత్సవ సంబరాలు

టిడిపి అభ్యర్థి ఎంఎస్ రాజు విజయం సాధించడంతో నియోజకవర్గ వ్యాప్తంగా టిడిపి నాయ కులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. ఐదు మండలాల్లో తెలుగుతమ్ముళ్లు టపాసులు పేల్చి, కేక్ కట్ చేసి పంచిపెట్టారు. సంబరాల్లో మండల కన్వీనర్లు లక్ష్మీనారాయణ, మనోహర్, దాసిరెడ్డి, కుమార స్వామి, గణేష్, మద్దనకుంటప్ప, నాయకులు కృష్ణమూర్తి, రామిరెడ్డి, నరసింహమూర్తి, శివరుద్రప్ప, ఇరిగేపల్లి శ్రీనివాస్, డొక్కలపల్లి శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులుకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు కార్యకర్తలు

రాయదుర్గంలో 'కాలవ' ఘనవిజయం

ఉమ్మడి అనంత జిల్లాలో అత్యధిక మెజారిటీ

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం 18వ ఎమ్మెల్యేగా తెలుగుదేశం పార్టీకి చెందిన కాలవ శ్రీనివాసులు భారీ మెజారిటీతో గెలుపొందారు. ఆయన తన సమీప ప్రత్యర్థి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన మెట్టు గోవిందరెడ్డిపై 41,659 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. కాలవ శ్రీనివాసులుకు 1,30,309 ఓట్లు రాగా గోవిందరెడ్డికి 88,650 ఓట్లు వచ్చాయి. ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు మొదలు కాగా సాయంత్రం 5 గంటలకు చివరి 22వ రౌండ్ ఓట్ల లెక్కింపు పూర్తయింది. కాలవ శ్రీనివాసులు ఎమ్మెల్యేగా గెలవడం ఇది రెండోసారి. 2014 ఎన్నికల్లో కాలవ 1,827 ఓట్ల ఆధిక్యతతో వైసిపికి చెందిన కాపు రామచంద్రారెడ్డిపై గెలవగా, 2019 ఎన్నికల్లో కాపుపై పోటీ చేసి 14,476 ఓట్ల తేడాతో ఓటమి చెందారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో తాను కనీసం 50వేల ఓట్ల మెజారిటీతో గెలుస్తానని కాలవ ధీమా వ్యక్తం చేశారు. అయితే గతంలో రాయదుర్గం నుంచి గెలిచిన ఏ ఎమ్మెల్యేకు రానంత మెజారిటీని ఆయన సాధించారు. అన్ని రౌండ్లలో కాలవ స్పష్టమైన మెజారిటీ సాధించారు. అంతేకాక జిల్లాలో ఎన్నికైన ఎమ్మెల్యేలందరికంటే కాలవ అత్యధిక మెజారిటీ సాధించడం గమనార్హం. ఆయన గెలుపుపై రాయదుర్గం నియోజకవర్గం అంతటా పార్టీ కార్యకర్తల్లో హర్షం వ్యక్తమైంది.



కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్న టిడిపి శ్రేణులు

ధర్మవరంలో పట్టణ ఓటర్లే కీలకం

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

ధర్మవరంలో మొదటి సారిగా భారతీయ జనతాపార్టీ అసెంబ్లీ ఎన్నికలలో బోణీ కొట్టింది. ధర్మవరం నియోజకవర్గంలో 2,45,758 ఓట్లు ఉండగా ఇందులో 2,18,282 ఓట్లు పోలయ్యాయి. వీటిలోకూడా బీజేపీ అభ్యర్థి సత్యకుమార్ యాదవ్‌కు 1,04957 ఓట్లు రాగా వైసీపీ అభ్యర్థి కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి 1,01983 ఓట్లు లభించాయి. దీంతో 2974 ఓట్లు మెజారిటీ రాగా బ్యాలెట్ ఓటు ద్వారా వచ్చిన 760 మెజారిటీతోకలిసి సత్యకుమార్ యాదవ్‌కు 3734 ఓట్ల అధిక్యత లభించింది. పోస్టల్ బ్యాలెట్ ద్వారా 1587 ఓట్లు బీజేపీకి రాగా వైసీపీకి 827, కాంగ్రెస్‌కు 36, ఇతరులకు 7 ఓట్లు రాగా మిగిలిన 798 ఓట్లు చెల్లనవిగా అధికారులు తేల్చేశారు. నియోజకవర్గంలోని ధర్మవరం మండలం, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మం డలాలు వైసీపీకి జై కొట్టగా ధర్మవరం పట్టణ వాసులు మాత్రం బీజేపీ అభ్యర్థికి అండగా నిలిచారు. వైసిపికి 12 రౌండ్లలో ఓటర్లు ఆధిక్యం ఇవ్వగా బీజేపీకి 9రౌండ్లలో మాత్రమే ఓటర్లు ఆధిక్యత ఇచ్చారు. వైసీపీకి 1 నుంచి 10వ రౌండ్ వరకు, అదేవిధంగా 20,21, రౌండ్లలో మెజారిటీ రాగా బీజేపీకి 11 నుంచి 19వరౌండ్ వరకు మెజారిటీ వచ్చింది. బీజేపీకి 13,14,19, రౌండ్లలో భారీ మోజారిటీ వచ్చింది. ఆ ఓటర్లే సత్యకుమార్ యాదవ్ విజయానికి కారకులయ్యారు. కాగా ఏ పార్టీ నచ్చక 1767 మంది నోటాకు ఓటు వేశారు.

అంబరాన్నంటిన సంబరాలు

ధర్మవరంలో ఎన్డీఏ కూటమి అభ్యర్థి సత్యకుమార్ గెలుపుతో ధర్మవరంలో కూటమి శ్రేణుల సంబరాలు అంబరాన్ని అంటాయి. ఎన్టీఆర్ సర్కిల్, కళాజ్యోతిసర్కిల్, గాంధీనగర్, మున్సిపల్ కార్యాలయం, ఆర్టీసీ బస్టాండ్, కాలేజ్ సర్కిల్ మీదుగా యువకులు ఉత్సాహం గా బైకులు, ఆటోలు, ప్రత్యేక వాహనాల్లో తిరుగుతూ సంబరాలు చేసుకున్నారు.



ధర్మవరం పట్టణంలో విజయోత్సవ సంబరాలు

ప్రజల రుణం తీర్చుకుంటా : దగ్గుపాటి



మీడియాతో మాట్లాడుతున్న దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

టిడిపి అధినేత చంద్రబాబుపై ప్రజలు పెట్టుకున్న నమ్మకంతోనే తమను భారీ మెజారిటీతో తాము గెలుపొందామని అనంతపురం అర్బన్ నియోజకవర్గం టిడిపి ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ అన్నారు. దగ్గుపాటి ప్రసాద్ తన సమీప ప్రత్యర్థి వైసిపి అభ్యర్థి అనంత వెంకటరామిరెడ్డిపై 23,023 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఈమేరకు ఎన్నికల అధికారి గ్రంధి వెంకటేష్ తో ఎమ్మెల్యేగా డిక్లరేషన్ ఫారాన్ని అందుకున్నారు. మొదటి రౌండ్ నుంచే దగ్గుపాటి ఆధిక్యత కనబరుస్తూ ప్రతిరౌండ్‌లో మెజారిటీ సాధించారు. దగ్గుపాటికి 1,03,334 ఓట్లు రాగా వైసిపి అభ్యర్థికి 94,169 ఓట్లు వచ్చాయి. 23023 ఓట్ల మెజారిటితో ఘన విజయం సాధించారు. ఈ సందర్భంగా జెఎన్‌టియులో కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌లో ఆయన మాట్లాడుతూ నా విజయానికి కష్టపడి పని చేసిన టిడిపి, జనసేన, బిజెపి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అనంతపురం నియోజకవర్గం ప్రజలందరికి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్డీఏ కూటమి సునామి సృష్టించి అధినేత నారా చంద్రబాబు నాయుడు నాల్గవ సారి రాష్ట్ర ముఖమంత్రిగా పరిపాలన చేయనుండటం, వారి నేతృత్వంలో తాము పాలు పంచుకునే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాని తెలిపారు. తాను ఇంటింటికి తిరిగి ప్రచారం చేసినప్పుడు ప్రజలు ఎంతో అప్యాయత అనురాగాలతో స్వాగతం పలికి ముందుకు నడిపారని, ఎమ్మెల్యేగా గెలిపించి బాధ్యతను పెంచారని తెలిపారు. తాను ఇచ్చిన హామీలు భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు, డంపింగ్ యార్డ్ తరలింపు, తాగునీరు, రోడ్లు పునర్ నిర్మాణం, వంటి హామీలన్ని అమలు చేసి నియోజకవర్గం ప్రజల రుణం తీర్చుకుంటానని తెలిపారు.

విజయోత్సవ ర్యాలీ

అనంతపురం అర్బన్ ఎమ్మెల్యేగా గెలుపొందిన దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ అభినందనలు వెల్లువెత్తాయి. టిడిపి, బిజెపి, జనసేన పార్టీ నేతలు విజయాభినందనలు తెలిపారు. టిడిపి శ్రేణులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. దగ్గుపాటి నివాసం వద్ద బాణా సంచా పేల్చి ఆనందాన్ని పంచుకున్నారు. ఉదయం నుంచే దగ్గుపాటి నివాసం వద్ద టివి వీక్షణలో పెద్ద ఎత్తున అభిమానులు, మిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొని రౌండ్ రౌండ్ మెజారిటిలో వచ్చి ఓట్లు చూస్తూ ఎంతో ఆనందాన్ని పొందారు. నియోజకవర్గంలో టిడిపి ముఖ్య నేతల నివాసాల వద్ద కూడా కార్యకర్తలు చేరుకుని బాణా సంచాలు పేల్చి మిఠాయిలు తినిపిస్తూ విజయోత్సాహాన్ని పొందారు. పలు డివిజన్‌లో విజయోత్సవ ర్యాలీలు కూడా నిర్వహించి ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

నా విజయం రాప్తాడు ప్రజలకు అంకితం : పరిటాల

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాప్తాడు ప్రజలు నా కోసం ఎంతో కష్టపడ్డారు. ఐదేళ్లలో ఎన్నో కేసులు, నిర్బంధాలు, నష్టాలు ఎదుర్కొన్నారు. ఓటు అనే ఆయుధంతో అరాచక శక్తులకు గుణపాఠం నేర్పి నన్ను గెలిపించారు. నా విజయం రాప్తాడు ప్రజలకు అంకితం చేస్తున్నాని రాప్తాడు శాసనసభ నియజకవర్గం ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. 2024 సాధరణ ఎన్నికల్లో 23,329 భారీ మెజారిటీతో ఘన విజయం సాధించారు. 1,16,140 ఓట్లు సాధించగా తన ప్రత్యర్థి వైఎస్ఆర్‌సిపి అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి 92,811 ఓట్లు సాధించారు. 23,329 ఓట్ల ఆధిక్యంతో విజయం పొందారు. రిటర్నింగ్ అధికారి నుంచి ఎమ్మెల్యే డిక్లరేషన్ పత్రాన్ని స్వీకరించారు. ఓట్ల లెక్కింపు కేంద్రం నుంచి బయటకు రాగానే ఎమ్మెల్యే సునీతకు అభినందనలు వెల్లువెత్తాయి. ఆమె కుమారుడు పరిటాల శ్రీరామ్‌ను హత్తుకుని విజయోత్సాహం ఆస్వాదించారు. తన తల్లికి స్వీట్ తినిపించి తనయుడు శ్రీరామ్ ఆనందోత్సవాన్ని తోటివారితో పంచుకున్నాడు. నాయకులు, కార్యకర్తలు, ఏజెంట్‌లు ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ అభినందనలు తెలిపారు. అనంతరం మీడియా కేంద్రంలో మాట్లాడుతూ రాప్తాడు ఎమ్మెల్యే చేసిన అరాచకాలు, అన్యాయాలు పెరిగిపోయి ప్రజలు వెసుగు చెంది వేసారిపోయారని తెలిపారు. తనకు ఎంతో బలంగా ప్రజలు నిలిచినందుకు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. రాప్తాడు ప్రజలు కష్టాలు తీర్చి వారి రుణం తీర్చుకుంటానన్నారు. తాను ఇచ్చిన హామీలు పేరురు డ్యామ్, జాకీ పరిశ్రమ ఏర్పాటు, ఇంటి స్థలాలు, ఇళ్లు ఇచ్చి హామీలన్ని నెరవేర్చుకుంటానని తెలిపారు. పరిటాల నివాసం వద్ద బాణాసంచాలు పేల్చి మిఠాయిలు, కేక్‌లు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

మొదటి పేజి తరువాయి

కూటమి 'ఫుల్'జోష్..!

ఎన్నికలకు వచ్చే సరికి ఫలితాలు పూర్తిగా తారుమారయ్యాయి. 14 అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాలూ టిడిపి కైవసం చేసుకుంది. ఈ ఫలితాలతో గతంలోనున్న రికార్డులు, సెంటిమెంట్లు సైతం తారుమారయ్యాయి. ఉరవకొండలో గెలిచే పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రాదన్న సెంటిమెంటు ఉంది. ఈసారి ఇక్కడ టిడిపి అభ్యర్థి పయ్యావుల కేశవ్ గెలుపొందారు. రాష్ట్రంలోనూ టిడిపి అధికారంలో రావడం రెండు దశాబ్ధాల తరువాత ఇదే మొదటిసారి. దీంతో పాత సెంటిమెంటు రూపుమాసిపోయింది. అన్ని స్థానాల్లోనూ ఒకేసార్టీ గెలుపొందడం కూడా ఇదే మొదటిసారి. ఇదొక రికార్డు కానుంది. హిందూపురం నుంచి మూడవసారి బాలకృష్ణ విజయం సాధించి హ్యాట్రిక్ విజయాన్ని సాధించారు.

కట్టుదిట్టమైన భద్రత నడుమ సాగిన ఓట్ల లెక్కింపు

ఓట్ల లెక్కింపు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య సాగింది. ఎక్కడా ఎటువంటి ఘటనలు చోటు చేసుకోకుండా భారీ భద్రతను ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రాల్లో అనుమతి ఉన్న వారిని మినహా తక్కిన వారిని రానివ్వలేదు. అదే విధంగా ప్రధాన పట్టణాల్లో 144 సెక్షన్ విధించడంతో కర్ఫ్యూ వాతావరణం సాయంత్రం వరకు కొనసాగింది. సాయంత్రం ఫలితాల తరువాత టిడిపి శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. అన్ని ప్రాంతాల్లో బైకులు, వాహనాల్లో పసుపు జెండాలను పట్టుకుని తిరుగుతూ సందడి చేశారు.

ప్రారంభం నుంచే ఆధిక్యం

ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

జెసి వారసుడి జయకేతనం

ఓటమి అన్నది ఎరుగకుండా తాడిపత్రిలో 1985 నుంచి గెలుస్తూ వచ్చిన జెసి కుటుంబం తొలిసారిగా 2019 ఎన్నికల్లో ఓటమి చెందింది. అప్పుడే జెసి కుటుంబం నుంచి జెసి.ప్రభాకర్‌రెడ్డి తనయుడు అస్మిత్‌రెడ్డి పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో ఓటమి చెందిన అస్మిత్‌రెడ్డి ఇప్పుడు జరిగిన 2024 సార్వత్రిక ఎన్నికల్లో మాత్రం విజయం సాధించి తొలి విజయాన్ని దక్కించుకున్నారు.

పనిచేయని టిప్పర్ డ్రైవరు క్యాంపెయిన్

టిప్పర్ డ్రైవర్‌కు టికెట్ అని పెద్దఎత్తున ప్రచారాన్ని వైసిపి చేపట్టింది. వైసిపి అభ్యర్థి వీరాంజినేయులు ఈ ప్రచారాన్ని జోరుగా చేసినా ఓటర్లు టిడిపి వైపే మొగ్గుచూపారు. టిడిపి అభ్యర్థి బండారు శ్రావణి 2019 ఎన్నికల్లోనూ పోటీ చేసి ఓటమి చెందారు. ఈ ఎన్నికల్లో ఆమె 8788 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.

ఫలించిన సురేంద్ర కల

రాజకీయాల్లో రాణించాలని కాంట్రాక్టర్ అయిన అమిలినేని సురేంద్రబాబు అనేక ఏళ్లుగా ప్రయత్నిస్తూ వస్తున్నారు. 2009లో ప్రజారాజ్యాం తరుపున పోటీ చేయాలని ప్రయత్నించి చివరి నిమిషంలో ఆ పార్టీ ఆయనకు కాదని మరొకరిచ్చింది. ఆ తరువాత 2014లోనూ అనంతపురం అర్బన్ టిడిపి టిక్కెట్టును ఆశించి చివరి నిమషంలో తప్పోయింది. ఆ తరువాత 2024లో ఆయనకు టిడిపి తరుపునే కళ్యాణదుర్గంకు టిక్కెట్టు దక్కింది. ఈ ఎన్నికల్లో ఆయన విజయం సాధించి ఎమ్మెల్యే అయ్యారు.

పార్టీ..జిల్లా.. మారి ఛాన్సుకొట్టిన జయరాం

వైసిపి పార్టీలో మంత్రిగా పనిచేసిన గుమ్మనూరు జయరాం... చివరి నిమిషంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. అంతేకాకుండా ముందు పోటీ చేసిన ఆలూరు కాకుండా గుంతకల్లుకు మారారు. నామినేషన్ల ప్రక్రియ మొదలైన తరువాత మారినప్పుడు విజయావకాశాలపై అనేక సందేహాలు వ్యక్తమయ్యాయి. ఇక్కడి క్యాడర్ ఏ మేరకు సహకరిస్తుందన్న అనుమానాలు ఆ పార్టీ నేతల్లోనే కనిపించాయి. పోటీ చేసి తాజా మాజీ ఎమ్మెల్యే వైసిపి అభ్యర్థి వెంకటరామిరెడ్డిపై విజయం సాధించారు.

ఎంపిపి నుంచి ఎమ్మెల్యేగా...

అనంతపురం అర్బన్ టిడిపి అభ్యర్థి దగ్గుబాటి వెంకట ప్రసాద్ చివరి నిమిషంలో టిక్కెట్టును దక్కించుకుని ఎమ్మెల్యేగా ఛాన్సు కొట్టారు. అది కూడా సీనియర్ నాయకులు అనంత వెంకటరామిరెడ్డిపై పోటీచేసి గెలుపొందారు. అంతకు మునుపు ఆయన ఎమ్మెల్యేగా పోటీ చేసిన అనుభవం లేకున్నా సీనియర్ నాయకుడిని ఢీకొని విజయం సాధించారు. గతంలో రాప్తాడు ఎంపిపిగా పని చేసిన ఈయన ప్రస్తుతం ఎమ్మెల్యేగా గెలుపొందారు.

పట్టునిలుపుకున్న పరిటాల సునీత

పరిటాల కుటుంబానికి జిల్లాలో ప్రత్యేకమైన స్థానముంది. ఒకప్పుడు జిల్లా రాజకీయాలను పరిటాల రవీంద్ర శాసించేవారు. ఓటమి అన్నది ఎరుగకుండా ఉన్న పరిటాల కుటుంబానికి 2019లో తొలిసారిగా ఓటమి ఎదురైంది. ఆ ఎన్నికల్లో పరిటాల శ్రీరామ్ తొలిసారిగా పోటీ చేసి ఓటమి చెందారు. ఈసారి పార్టీ అధిష్టానం పరిటాల సునీతను తిరిగి బరిలో దింపింది. ఈ ఎన్నికల్లో సునీత మరోమారు గెలుపొందారు.

హ్యాట్రిక్ కొట్టిన బాలయ్య

హిందూపురం అసెంబ్లీ నుంచి పోటీ చేస్తున్న బాలకృష్ణ మూడవసారి గెలుపొంది హ్యాట్రిక్ విజయాన్ని సాధించారు. 2014లో తొలిసారిగా అసెంబ్లీ బరిలోకి బాలకృష్ణ దిగారు. ఆ తరువాత 2019లో రాష్ట్ర వ్యాప్తంగా ఫ్యాన్ గాలి వీచినా ఆయన విజయం సాధించారు. ఇప్పుడు మూడవసారి కూడా ఇక్కడి నుంచే బరిలో దిగి గెలుపొందారు.

కదిరి నుంచి రెండోసారి కందికుంట..

కదిరి అసెంబ్లీ నియజకవర్గం నుంచి కందికుంట వెంకటప్రసాద్ రెండవసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2004లో ఆయన తొలిసారిగా అసెంబ్లీ బరిలోకి స్వతంత్ర అభ్యర్థిగా దిగారు. ఆ తరువాత తెలుగుదేశం పార్టీలో చేరి 2009లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2014, 2019 ఎన్నికల్లోనూ పోటీ చేసి ఓటమి చెందారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లోనూ ఆయనకే టిడిపి టిక్కెట్టు కేటాయించింది. ఆయన రెండవసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

ఎమ్మెల్యేగా ఎంఎస్.రాజు..

బీఫామ్ ఇచ్చే సమయంలో టిక్కెట్టు పట్టుకుని మడకశిర అసెంబ్లీ బరిలో దిగిన ఎంఎస్.రాజు స్వల్ప మెజార్టీతో గెలుపొందారు. ఓట్ల లెక్కింపు అంతా ఉత్కంఠబరితంగా ఇక్కడ సాగింది. స్వల్ప మెజార్టీతోముందు నుంచి నెట్టుకుంటూ వచ్చిన ఎంఎస్ రాజు 351 ఓట్లతో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

పల్లె వారసురాలిగా సింధూరరెడ్డి

రాజకీయాల్లో సీనియర్ నాయకుడిగా ఉన్న పల్లె రఘునాథరెడ్డి రాజకీయ వారసురాలిగా ఆయన కోడలు పల్లె సింధూరరెడ్డి తొలి పోటీలోనే గెలుపొందారు. పుట్టపర్తి ఓట్ల లెక్కింపులోనూ కొన్ని రౌండ్లు ఆమె వెనుకబడి ఉన్నారు. ఆ తరువాత పుంజకుని గెలుపొందారు.

తొలిసారి ఎమ్మెల్యేగా సవితమ్మ

పెనుకొండ నియోజకవర్గం నుంచి మాజీ మంత్రి ఉషశ్రీచరణ్‌ను ఓడించి ఎమ్మెల్యేగా సవితమ్మ ఎన్నికయ్యారు. గతంలోనూ టిక్కెట్టు ఆశించి దక్కలేదు. ఈసారి టిక్కెట్టు దక్కడంతో పెనుకొండలో విజయం సాధించి పసుపు జెండాను ఎగురువేశారు.

ధర్మవరంలో తొలిసారి బిజెపి గెలుపు

ధర్మవరంలో కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి ఈసారి ఓటమి తప్పలేదు. బిజెపి అభ్యర్థి సత్యకుమార్ యాదవ్ స్థానికేతరుడు కావడంతో తనకు విజయవకాశాలు మొండుగా ఉంటాయని భావించారు. అయితే ధర్మవరం పట్టణ ప్రజలు ఆయనకు వ్యతిరేకంగా ఓటు వేయడంతో కేతిరెడ్డి ఓటమిని చవిచూడక తప్పలేదు.


చెట్టు కింద భోజనం చేస్తున్న జెసి ప్రభాకర్‌రెడ్డి (పాతచిత్రం)

పెద్దవడుగూరులో టిడిపి ఆధిక్యం

పెద్దవడుగూరు : ఒకప్పుడు మండలంలో టిడిపికి మంచి పట్టు ఉండేది. అదికాస్త వైసిపికి అనుకూలం కావడంతో ప్రతిసారి జరిగిన ఎన్నికల్లో పెద్దవడుగూరు మండలం వైసిపికి మెజార్టీ తెచ్చిపెడుతోంది. ఇందులో భాగంగా 2019 ఎన్నికల్లో కూడా వైసిపి తరపున పోటీ చేసిన కేతిరెడ్డి పెద్దారెడ్డికి 6,700 ఓట్ల మెజార్టీ వచ్చింది. అయితే ఈ సారి మండల ఓటర్లు టిడిపి అభ్యర్థి జెసి అభ్యర్థికి జై కొట్టారు. ఈ ఎన్నికల్లో అస్మిత్‌రెడ్డికి 2,884 ఓట్లు మెజార్టీ దక్కింది. ఇందులో ఓటర్లతోపాటు పోస్టల్ బ్యాలెట్‌లో కూడా 663 ఓట్ల మెజార్టీ ఉన్నాయి. నియోజకవర్గంలోని ప్రజలందరూ గత ఎన్నికల్లో మాదిరి పెద్దవడుగూరు మండలంపై ఆసక్తిని పెంచుకోగా వారి ఆశలను టిడిపి దెబ్బతీసింది. ఇందుకు కారణం జెసి ప్రభాకర్‌రెడ్డి మండలంలో చేపట్టిన బస్సుయాత్రే కారణమని చెప్పవచ్చు. ఏదేమైనా మండలంలో టిడిపికి మెజార్టీ రావడంపై ఆపార్టీ శ్రేణుల్లో సంబరాలు మొదలయ్యాయి.

'గుమ్మనూరు'దే గుంతకల్లు

9,300 ఓట్ల మెజారిటీతో విజయం

గుంతకల్లు : గుంతకల్లు నియోజకవర్గ ఎమ్మెల్యేగా గుమ్మనూరు జయరామ్ విజయకేతనం ఎగురవేశారు. సమీప ప్రత్యర్థి వై.వెంకటరామిరెడ్డిపై 9,300 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. నియోజకవర్గంలో ఇవిఎంల ద్వారా 2,06,765 మంది, పోస్టల్ బ్యాలెట్ ద్వారా 3,612 మంది ఓటుహక్కు వినియోగంచుకున్నారు. ఆయా ఓట్లను 20 రౌండ్లలో లెక్కించగా గుమ్మనూరు జయరామ్‌కు 1,01,700, వై.వెంకట్రామిరెడ్డికి 94,874, కాంగ్రెస్ అభ్యర్థి కె.ప్రభాకర్‌కు 5,146 ఓట్లు వచ్చాయి. తుది ఫలితం అనంతరం టిడిపి అభ్యర్థి గుమ్మనూరు జయరామ్ 9,300 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. దీంతో నియోజకవర్గ వ్యాప్తంగా టిడిపి నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు.

వైసిపి జిల్లా యువజన అధ్యక్షుడిపై దాడి

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని ముదిరెడ్డిపల్లిలో వైసిపి జిల్లా యువజన అధ్యక్షులు లోకేష్‌పై టిడిపి మద్దతు దారులు మంగళవారం సాయంత్రం దాడి చేశారు. గత నెల ఎన్నికల ప్రచారంలో భాగంగా బాలకృష్ణ సతీమణి వసుంధర దేవి ముదిరెడ్డిపల్లి ప్రాంతంలో ప్రచారం నిర్వహించారు. ఆ సమయంలో టిడిపి నాయకులపై వైసిపి నాయకులు, మద్దతు దారులు దాడులకు పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో మంగళవారం హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ హ్యాట్రిక్ సాధించడంతో టిడిపి నాయకులు, మద్దతు దారులు ముద్దిరెడ్డిపల్లిలో సంబరాలు చేసుకుంటూ ర్యాలీగా వస్తున్నారు. అదే ప్రాంతంలో నివాసం ఉంటున్న లోకేష్ తన ఇంటికి వెళ్లడానికి వెళుతున్నారు. దీనిని గమనించిన టిడిపి వారు లోకేష్‌పై దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో లోకేష్ కు రక్త గాయాలు అయ్యాయి. గాయపడిన లోకేష్‌ను వైసిపి నాయకులు జిల్లా ప్రభుత్వ అసుపత్రికి తీసుకువచ్చారు. ముక్కులో రక్త స్రావం తగ్గక పోవడంతో మెరుగైన వైద్య సేవల కోసం బెంగళూరుకు తరలించారు.

అభివృద్ధికి పట్టం కట్టిన ప్రజలు

ప్రజాశక్తి - నార్పల

రాష్ట్ర ప్రజలు అభివృద్ధికే పట్టం కట్టారని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, సీనియర్ నాయకులు ఆలం వెంకట నరసానాయుడు, ఆకుల ఆంజనేయులు, ఆకుల ప్రసాద్, విజయకుమార్ తదితరులు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్తు తరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు భారీ ఎత్తున టిడిపికి ఓట్లు వేశారన్నారు. వారి నమ్మకాన్ని అనుభవశాలి అయిన చంద్రబాబు వమ్ముచేయరన్నారు. టిడిపిని ఆదరించిన ఓటర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే టిడిపి తరపున విజయం సాధించిన ఎమ్మెల్యే అభ్యర్థులందరికీ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
అనంతపురం
బుధవారం 5
జూన్ 2024



ఉమ్మడి జిల్లాలో..



కూటమికి పట్టం..!



ఉమ్మడి అనంతపురం జిల్లా అంతటా కూటమి తుఫాన్ సాగింది. మంగళవారం విడుదల అయిన సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో 14 అసెంబ్లీ, రెండు పార్లమెంట్ స్థానాల్లో టిడిపి అభ్యర్థులు విజయం సాధించారు. అంచనాలకు మించి ఫలితాలు రావడంతో ఆ పార్టీ శ్రేణులు ఆనందంలో మునిగిపోయారు. ఒకానొక దశలో కనీసం రెండు స్థానాల్లో అయినా వైసిపి గెలుస్తుందన్న ఆశలుండగా చివరకు అవి కూడా కూటమి ఖాతాలోనే చేరాయి. టిడిపి ఆవిర్భావం తర్వాత ఆపార్టీకి ఇంత పెద్ద సంఖ్యలో ఓట్లు రావడం ఇదే తొలిసారి. గతంలో వైసిపికి పెద్ద ఎత్తున మెజార్టీ వచ్చిన గుంతకల్లు, శింగనమల, రాప్తాడు, అనంతపురం తదితర నియోజకవర్గాలు సైతం కూటమి సునామీలో కొట్టుకుపోయాయి. ఫలితాలు ప్రారంభమైన మొదటి రౌండ్ నుంచే టిడిపి కూటమి అభ్యర్థులు స్పష్టమైన మెజార్టీ సాధిస్తూ వచ్చారు. ఫలితాల తీరును చూసిన వైసిపి అభ్యర్థులు ఒక్కొక్కరుగా కేంద్రాన్ని వదలి బయటకు వెళ్లిపోయారు. టిడిపి కూటమి చిరస్మరణీయ విజయంతో ఆ పార్టీ శ్రేణులు సంబరాల్లో మునిగిపోయారు.

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



ఓట్ల నమోదు బోర్డును పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్ కుమార్



కౌంటింగ్ కేంద్రంలో ఓట్ల లెక్కింపు పక్రియను పరిశీలిస్తున్న అనంతపురం కలెక్టర్ వినోద్‌కుమార్



ధర్మవరంలో కూటమి నాయకుల సంబరాలు



హిందూపురంలో తెలుగుతమ్ముళ్ల సంబరాలు



కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్‌కు శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు

నియోజకవర్గం: అనంతపురం అర్బన్

గెలిచిన అభ్యర్థి : దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్
పార్టీ : టిడిపి
వచ్చిన ఓట్లు : 1,03,334
మెజార్టీ : 23,023

ప్రత్యర్థి: అనంత వెంకటరామిరెడ్డి
పార్టీ : వైసిపి
వచ్చిన ఓట్లు : 80,311

సిపిఐ అభ్యర్థి : సి.జాఫర్
ఓట్లు: 2,838

నియోజకవర్గం: తాడిపత్రి

గెలిచిన అభ్యర్థి :జేసీ అస్మిత్‌రెడ్డి
పార్టీ : టిడిపి
వచ్చిన ఓట్లు : 1,13,755
మెజార్టీ : 27,731

ప్రత్యర్థి: కేతిరెడ్డి పెద్దారెడ్డి
పార్టీ : వైసిపి
వచ్చిన ఓట్లు : 86,024

కాంగ్రెస్ అభ్యర్థి : జి. నాగిరెడ్డి
ఓట్లు: 2,628

నియోజకవర్గం: శింగనమల

గెలిచిన అభ్యర్థి : బండారు శ్రావణి
పార్టీ : టిడిపి
వచ్చిన ఓట్లు : 1,02,957
మెజార్టీ : 8,788

ప్రత్యర్థి: వీరాంజినేయులు
పార్టీ : వైసిపి
వచ్చిన ఓట్లు : 94,169

బిఎస్‌పి అభ్యర్థి : సుందరం గౌతమి
ఓట్లు: 3896

నియోజకవర్గం: ఉరవకొండ

గెలిచిన అభ్యర్థి : పయ్యావుల కేశవ్
పార్టీ : టిడిపి
వచ్చిన ఓట్లు : 1,02,౿6
మెజార్టీ : 21,704

ప్రత్యర్థి: వై.విశ్వేశ్వరరెడ్డి
పార్టీ : వైసిపి
వచ్చిన ఓట్లు : 80,342

కాంగ్రెస్ అభ్యర్థి : వై. మధుసూదన్‌రెడ్డి
ఓట్లు: 4529

నియోజకవర్గం: కళ్యాణదుర్గం

గెలిచిన అభ్యర్థి : అమిలినేని సురేంద్రబాబు
పార్టీ : టిడిపి
వచ్చిన ఓట్లు : 1,18,878
మెజార్టీ : 37,734

ప్రత్యర్థి: తలారి రంగయ్య
పార్టీ : వైసిపి
వచ్చిన ఓట్లు : 81,144

కాంగ్రెస్ అభ్యర్థి : రాంభూపాల్‌రెడ్డి
ఓట్లు: 2585

నియోజకవర్గం: రాయదుర్గం

గెలిచిన అభ్యర్థి : కాలవ శ్రీనివాసులు
పార్టీ : టిడిపి
వచ్చిన ఓట్లు : 1,30,309
మెజార్టీ : 41,659

ప్రత్యర్థి: మెట్టు గోవిందరెడ్డి
పార్టీ : వైసిపి
వచ్చిన ఓట్లు : 88,650

కాంగ్రెస్ అభ్యర్థి : చిన్నప్పయ్య
ఓట్లు: 3388

నియోజకవర్గం : గుంతకల్లు

గెలిచిన అభ్యర్థి : గుమ్మనూరు జయరాం
పార్టీ : టిడిపి
వచ్చిన ఓట్లు : 1,01,700
మెజార్టీ : 6,826

ప్రత్యర్థి: వెంకట రామిరెడ్డి
పార్టీ : వైసిపి
వచ్చిన ఓట్లు : 94,874

కాంగ్రెస్ అభ్యర్థి : ప్రభాకర్
ఓట్లు : 5146

నియోజకవర్గం: ధర్మవరం

గెలిచిన అభ్యర్థి : సత్యకుమార్ యాదవ్
పార్టీ : బిజెపి
వచ్చిన ఓట్లు : 1,06,544
మెజార్టీ : 3734

ప్రత్యర్థి: కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి
పార్టీ : వైసిపి
వచ్చిన ఓట్లు : 1,02,810

కాంగ్రెస్ అభ్యర్థి : రంగన అశ్వర్థనారాయణ
ఓట్లు: 3758

నియోజకవర్గం: రాప్తాడు

గెలిచిన అభ్యర్థి : పరిటాల సునీత
పార్టీ : టిడిపి
వచ్చిన ఓట్లు : 1,16,140
మెజార్టీ : 23,329

ప్రత్యర్థి: తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి
పార్టీ : వైసిపి
వచ్చిన ఓట్లు : 92,811

కాంగ్రెస్ అభ్యర్థి : శంకరయ్య
ఓట్లు: 3456

నియోజకవర్గం : కదిరి

గెలిచిన అభ్యర్థి : కందికుంట వెంకటప్రసాద్
పార్టీ : టిడిపి
వచ్చిన ఓట్లు : 1,03,610
మెజార్టీ : 6265

ప్రత్యర్థి: మక్బూల్ బాషా
పార్టీ : వైసిపి
వచ్చిన ఓట్లు : 97,345

కాంగ్రెస్ అభ్యర్థి : షానవాజ్
ఓట్లు: 3314

నియోజకవర్గం: మడకశిర

గెలిచిన అభ్యర్థి : ఎంఎస్. రాజు
పార్టీ : టిడిపి
వచ్చిన ఓట్లు : 79,983
మెజార్టీ : 351

ప్రత్యర్థి: ఈర లక్కప్ప
పార్టీ : వైసిపి
వచ్చిన ఓట్లు : 79,637

కాంగ్రెస్ అభ్యర్థి : సుధాకర్
ఓట్లు: 17,380

నియోజకవర్గం: పెనుకొండ

గెలిచిన అభ్యర్థి : సవితమ్మ
పార్టీ : టిడిపి
వచ్చిన ఓట్లు : 1,13,832
మెజార్టీ : 33,388

ప్రత్యర్థి: ఉషశ్రీ చరణ్
పార్టీ : వైసిపి
వచ్చిన ఓట్లు : 80,444

బిఎస్‌పి అభ్యర్థి : ఎం. ఆదినారాయణ
ఓట్లు: 6201

నియోజకవర్గం: పుట్టపర్తి

గెలిచిన అభ్యర్థి : పల్లె సింధూర రెడ్డి
పార్టీ : టిడిపి
వచ్చిన ఓట్లు : 91,741
మెజార్టీ : 8760

ప్రత్యర్థి: దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి
పార్టీ : వైసిపి
వచ్చిన ఓట్లు : 82,981

అభ్యర్థి : గోవింద్
వచ్చిన ఓట్లు: 3811

నియోజకవర్గం: హిందూపురం

గెలిచిన అభ్యర్థి : నందమూరి బాలకృష్ణ
పార్టీ : టిడిపి
వచ్చిన ఓట్లు : 1,07,250
మెజార్టీ : 32,597

ప్రత్యర్థి: దీపిక
పార్టీ : వైసిపి
వచ్చిన ఓట్లు : 74,653

కాంగ్రెస్ అభ్యర్థి : ఇనయతుల్లా
ఓట్లు: 8958

నియోజకవర్గం: హ్నిందూపురం(పార్లమెంట్)

గెలిచిన అభ్యర్థి : బికె. పార్థసారథి
పార్టీ : టిడిపి
వచ్చిన ఓట్లు : 7,13,013
మెజార్టీ :125607

ప్రత్యర్థి : బోయ శాంతమ్మ
పార్టీ : వైసిపి
వచ్చిన ఓట్లు : 587460

విజయం: టిడిపి



నాయకులతో కలిసి వస్తున్న పెనుకొండ ఎమ్మెల్యే సవితమ్మ



మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్. రాజును పైకెత్తి సంబరాలు చేసుకుంటున్న తెలుగుతమ్ముళ్లు

నియోజకవర్గం: అనంతపురం (పార్లమెంట్)

గెలిచిన అభ్యర్థి : అంబికా లక్ష్మినారాయణ
పార్టీ : టిడిపి
వచ్చిన ఓట్లు : 755862
మెజార్టీ : 182093

ప్రత్యర్థి : శంకర నారాయణ
పార్టీ : వైసిపి
వచ్చిన ఓట్లు : 573769

విజయం: టిడిపి



కౌంటింగ్ పూర్తి కాకుండానే వెళ్లిపోతున్న మెట్టు గోవిందరెడ్డి

కౌంటింగ్ మధ్యలోనే వెళ్లిపోయిన వైసిపి అభ్యర్థి 'మెట్టు'

రాయదుర్గం : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా రాయదుర్గంలో టిడిపి అభ్యర్థి కాలవ శ్రీనివాసులు ఘన విజయం సాధించడంతో వైసిపి అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి ఓట్ల లెక్కింపు కేంద్రం నుంచి మధ్యలోనే నిరాశతో వెనుదిరిగారు. సగం రౌండ్లు పూర్తయ్యే సరికి రాష్ట్రంలో, రాయదుర్గం అసెంబ్లీ సెగ్మెంట్‌లో టిడిపి స్పష్టమై ఆధిక్యతను కనబరచడంతో మెట్టు గోవిందరెడ్డి ఓట్ల లెక్కింపు పూర్తవకుం డానే కౌంటింగ్ కేంద్రం నుంచి వెళ్లిపోయారు.

ఓటర్లకు 'మెట్టు' కృతజ్ఞతలు

రాయదుర్గం : వైసిపికి అండగా ఉంటూ తనతో కలిసి నడిచిన పార్టీ కుటుంబ సభ్యులు, నాయ కులు, అభిమానులు, కార్యకర్తలకు ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. రాజకీయాల్లో గెలుపు, ఓటములు సహజం, కావున ఎవ్వరూ నిరుత్సాహ పడవద్ద న్నారు. తనకు, పార్టీకి ఓట్లు వేసిన ప్రతి ఒక్కరికీ అండగా ఉంటూ ప్రజాసేవలో కొనసాగుదామని పిలుపు నిచ్చారు. కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా తాను అందుబాటులో ఉంటానన్నారు. ఏ కష్టమొ చ్చినా తన తో పాటు ప్రతి కార్యకర్త వెన్నుదన్నుగా ఉంటూ కలిసి కొనసాగుదామని మెట్టు గోవిందరెడ్డి కోరారు.

జాతీయ ఉపకార వేతనాల పరీక్ష ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - కొత్తచెరువు రూరల్

రాష్ట్రవ్యాప్తంగా జరిగిన జాతీయ ఉపకారవేతన పరీక్ష (ఎన్ఎంఎంఎస్)కు సంబంధించిన ఫలితాలు విడుదల అయ్యాయి. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల సంచాలకులు దేవానంద్ రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో గానీ లేదా ప్రభుత్వ పరీక్షల సంచాలకుల వెబ్‌సైట్‌లో గాని పరీక్ష ఫలితాలను తెలుసుకోవచ్చని వారు తెలిపారు. ఎంపిక అయిన విద్యార్థుల యొక్క మెరిట్ కార్డులు త్వరలో సంబంధిత జిల్లా విద్యాశాఖాధికారి వారి కార్యాలయానికి పంపుతామని వివరించారు.

చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించండి

ఎస్పీ మాధవరెడ్డి

ప్రజాశక్తి-హిందూపురం

కౌంటింగ్ కేంద్రమైన హిందూపురం బిట్స్ కళాశాల పరిసరాలల్లో బందోబస్తు విధుల్లో ఉన్న సిబ్బంది ప్రతి ఒక్కరిని జిల్లా ఎస్ పి మాధవ్ రెడ్డి అప్రమత్తం చేశారు. మంగళవారం ఉదయం పోలీసుల విధుల పాయింట్లలో ఉన్న పోలీసుల వద్దకు వెళ్లి పరిశీలన చేసి వారికి అప్పగించిన విధులను గుర్తు చేస్తూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎంట్రీ పాయింట్ వద్ద ప్రతి ఒక్కరిని తనిఖీ చేయాలన్నారు. ఏమాత్రం ఏమరుపాటుగా ఉండకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని ఆదేశించారు.



పోలీస్ అధికారులకు సూచనలు ఇస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

ప్రజల తీర్పు ఏకపక్షం

రాయదుర్గం టిడిపి ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాష్ట్ర ప్రజలు జయహో ఎన్డీఏ అని, కూటమికి జేజేలు పలికారని రాయదుర్గం టిడిపి ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన సందర్భంగా మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఐదేళ్ల జగన్ అరాచక పాలనకు ప్రజలు చరమగీతం పాడుతూ 2019 ఎన్నికల్లో వైసిపి కంటే ఎక్కువ సీట్లు కూటమికి ఇవ్వాలని నిర్ణయించారన్నారు. చంద్రబాబు చల్లని పాలన ఈ రాష్ట్రానికి అత్యవసరమని ప్రజలు భావించారన్నారు. చంద్రబాబు చేతిలో ఈ రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని నమ్మి రాష్ట్ర ప్రజలు ఏకపక్షంగా తీర్పు ఇచ్చారని తెలిపారు. ఎన్డీఏ కూటమిని ఆదరించినందుకు, ఘన విజయం భారీ మెజారిటీ రూపంలో ఇచ్చినందుకు ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కాలవ శ్రీనివాసులు అఖండ మెజార్టీతో గెలుపొందడం, రాష్ట్రంలో కూటమి ప్రభంజనం సృష్టించడంతో



రాయదుర్గంలో టిడిపి నేతల సంబరాలు



మీడియాతో మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు

పట్టణంలోని నేసేపేట చౌడేశ్వరీదేవి ఆలయం వద్ద తొగట వీర క్షత్రియ సంఘం నాయకులు 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కు చెల్లించుకున్నారు. కాలవ అభిమానులు, తెలుగుతమ్ముళ్లు వినాయక కూడలి, లక్ష్మీ బజార్, తదితర ప్రాంతాలలో బాణసంచా కాల్చారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలకు జెండాలు కట్టి పట్టణ వీధుల్లో తిరిగారు.

టిడిపి విజయోత్సవ ర్యాలీని అడ్డుకున్న పోలీసులు

రాష్ట్రంతో పాటు రాయదుర్గంలో టిడిపి ఘన విజయం సాధించడంతో పట్టణంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ర్యాలీ చేపట్టారు. పట్టణంలోని వివిధ ప్రాంతాలలో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ఇతర వాహనాలకు టిడిపి జెండాలు కట్టుకొని కేరింతలు వేస్తూ ర్యాలీ చేశారు. అయితే సిఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది వారిని అడ్డుకున్నారు. రాష్ట్ర మంతటా 144 సెక్షన్, పోలీస్ చట్టం 30 ఆంక్షలు అమలులో ఉన్నందు విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదని చెప్పి వారిని వెనక్కు పంపారు.

కూటమి శ్రేణుల సంబరాలు

ప్రజాశక్తి-గోరంట్ల

సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా కూటమి అభ్యర్థులు అత్యధిక స్థానాల్లో గెలుపొందడంతో మండలంలో టిడిపి, బిజెపి, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. గోరంట్ల పట్టణంలో బాణసంచా పేల్చడంతో పాటు బైక్ ర్యాలీలు చేపట్టారు. కేకులు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. పురవీధుల్లో మహిళలు సైతం టపాసులు పేలుస్తూ హర్షం వ్యక్తం చేశారు. నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఐదేళ్ల రాక్షస పాలనకు ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పారన్నారు. రాష్ట్రం అభివృద్ధి చంద్రబాబు వల్లే సాధ్యమవుతుందని ప్రజలు గమనించి కూటమి అభ్యర్థులు భారీ మెజారిటీతో గెలిపించారని తెలిపారు.

సోమందేపల్లి : రాష్ట్రంలో టిడిపి అఖండ మెజారిటీ సాధించడం, పెనుకొండలో టిడిపి అభ్యర్థి సవితమ్మ 33వేలకు పైగా మెజార్టీతో గెలవడంతో సోమందేపల్లిలో తెలుగు తమ్ముళ్లు విజయోత్సవ సంబరాలు చేసుకున్నారు. పార్టీ కార్యాలయం వద్దకు నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున చేరుకొని మిఠాయిలు తినిపించుకున్నారు. అనంతరం ఎన్టీఆర్ సర్కిల్, వాల్మీకి సర్కిల్, తదితర సర్కిళ్ల మీదుగా బైక్ ర్యాలీ నిర్వహించారు. టిడిపి యువ నాయకులు కత్తి మారుతి ఆధ్వర్యంలో టపాసులు పేల్చి కార్యకర్తలకు స్వీట్లు పంచారు. కార్యక్రమంలో నాయకులు కత్తి మధు, హరి, లక్ష్మన్న, అశ్వర్థ, నాగమణి, సుశీల, అజయ్, అమర్నాథ్, తదితరులు పాల్గొన్నారు.

రొద్దం : రాష్ట్రంలో కనీవిని ఎరుగని రీతిలో టిడిపి అత్యధిక స్థానాల్లో గెలుపొందడంతో మండల వ్యాప్తంగా ఆ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు.



రొద్దంలో కేక్ కట్ చేసిన టిడిపి నాయకులు



గోరంట్ల కేక్ కట్ చేసిన టిడిపి నాయకులు

రొద్దంలో యువకులు, నాయకులు, కార్యకర్తలు టపాసులు పేల్చి కేక్ కట్ చేశారు. సంబరాల్లో బికె.పార్థసారథి సతీమణి కమలమ్మ, జిల్లా మహిళా అధ్యక్షులు సుబ్బరత్నమ్మ, మహిళలు పాల్గొన్నారు. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘ కార్యాలయం పై



సోమందేపల్లిలో మహిళల విజయ కేతనం

టిడిపి జెండాను ఎగురవేశారు. టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరీష్ గ్రామ సమీపంలోని బైలాంజనేయస్వామి ఆలయంలో 101 కొబ్బరి కాయలు కొట్టి మొక్కు తీర్చుకొన్నారు. కార్యక్రమంలో షణ్ముఖ, కాంతప్ప, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

సంబరాల్లో ఘర్షణలు

మండలంలోని గౌరాజుపల్లిలో టిడిపి శ్రేణులు ప్రధాన రహదారిలో ఊరేగింపుగా వెళ్తుండగా స్థానిక వైసిపి నాయకులు టపాసులు కాల్చవద్దని అడ్డుకున్నారు. దీంతో ఇరు వర్గాలు ఘర్షణకు ఒకరిపై ఒకరు రాళ్లు రువ్వుకున్నారు. విషయం తెలుసుకొన్న ఎస్ఐ వలిబాషా అక్కడికి చేరుకొని రెండు పార్టీల నాయకులను చెదరుకొట్టి పంపించారు.

కదిరిలో 'కందికుంట'కే పట్టం

ప్రజాశక్తి - కదిరి అర్బన్

కదిరి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్‌కు కదిరి నియోజకవర్గ ప్రజలు పట్టం కట్టారు. 2004లో కదిరి ప్రజలకు రాజకీయ పరిచయం అయిన కందికుంట నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు కృషి చేశారు. నియోజకవర్గంలో బలమైన ప్రజానాయకుడిగా పేరుపొందిన కందికుంటకు 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పట్టం కట్టారు. ఈసందర్భంగా కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ తన విజయానికి కారణమైన వారందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు చెబుతున్నానన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు.



కందికుంట, పవన్ ఆత్మీయ ఆలింగనం



ద్విచక్ర వాహనానికి ఫ్యాన్ కట్టుకొని టిడిపి శ్రేణులు ర్యాలీ

టిడిపి, వైసిపి శ్రేణుల మధ్య ఘర్షణ

ఫ్యాన్‌ను ఈడ్చుకుంటూ వెళ్లిన తెలుగుతమ్ముళ్లు

గొడవకు దిగిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తి నియోజకవర్గంలో టిడిపి ఘనవిజయం సాధించడంతో టిడిపి స్థానిక నాయకులు, కార్యకర్తలు అత్యుత్సాహం ప్రదర్శించడంతో టిడిపి, వైసిపిల మధ్య ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. టిడిపి వారు ద్విచక్రవాహనంలో వెళుతూ వైసిపి గుర్తు అయిన ఫ్యాన్‌ను రహదారిపై ఈడ్చుకుంటూ వెళ్లడంతో అది కాస్త వివాదంగా మారింది. టిడిపి వారు పట్టణంలోని సత్తెమ్మ గుడి సర్కిల్ నుంచి ఫ్యాన్లను తాడుతో కట్టి లాగుతూ కర్నాటక నాగేపల్లి, కొత్త రోడ్డు మీదుగా గణేష్ సర్కిల్ వద్దకు చేరుకున్నారు. అక్కడ వైసీపీ అభ్యర్థి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి నివాసం వద్ద కొద్దిసేపు కేకలు, ఈలలు వేశారు. దీంతో అక్కడ ఉన్న వైసిపి శ్రేణులు ఘర్షణకు దిగారు. అది కాస్త వివాదంగా మారడంతో ఏమి జరుగుతుందో అనిఆ ప్రాంత ప్రజలు ఆందోళనలో పడ్డారు. విషయం తెలిసిన వెంటనే సిఐ కొండారెడ్డి తన సిబ్బందితో వెళ్లి ఇరు వర్గాలను చెదరగొట్టడంతో వివాదం సద్దుమణిగింది.

పుట్టపర్తిలో తెలుగుతమ్ముళ్ల సంబరాలు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి నియోజకవర్గంలో టిడిపి అభ్యర్థి విజయం సాధించడపై మండల పరిధిలోని పలు గ్రామాల్లో టిడిపి శ్రేణుల సంబరాలు అంబరాన్నీ అంటాయి. మేజర్ పంచాయతీ పెడపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ శ్రీరామ్ నాయక్ ఇంటిముందు గిరిజనులు నృత్యం చేశారు. టిడిపి శ్రేణులు పెడపల్లి రహదారిలో టపాసులు పేల్చి కేరింతలు కొట్టారు. అదేవిధంగా మామిళ్ళకుంట క్రాస్, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, నిడిమామిడి, కొట్లపల్లి, వెంగళమ్మ చెరువు, బొంతలపల్లి, అమ్మళ్లకొండ పాల్యం గ్రామాల్లో తెలుగుదేశం శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. పార్టీ కార్యాలయాల్లో కేకులు కోసి తినిపించుకున్నారు. పల్లె సింధూర రెడ్డి విజయంపై నాయకులు వెంగళమ్మ చెరువు శ్రీరామిరెడ్డి, ఆదినారాయణ రెడ్డి, వెంకట గారి పల్లి, ఓబులేసు, పుల్లప్ప, కొట్లపల్లి కంసల నారాయణస్వామి, జగన్ రామయ్య, నేత మప్ప, రామంజి, రామ సుబ్బారెడ్డి, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

కొనసాగిన 'సెంటిమెంట్'

ప్రజాశక్తి-నార్పల

శింగనమల సెంటిమెంట్ మరోసారి నిజమైంది. ఈ నియోజకవర్గంలో ఎవరు గెలిస్తే అదే పార్టీకి సంబంధించిన నాయకులు సిఎం అవుతారు. దాదాపు మూడు దశాబ్దాలుగా ఇదే సెంటిమెంట్ కొనసాగుతోంది. 1983లో టిడిపి అభ్యర్థి గురుమూర్తి సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి ఆనందరావుపై విజయం సాధించగా ముఖ్యమంత్రిగా నందమూరి తారక రామారావు ప్రమాణ స్వీకారం చేశారు. 1985లో కొత్తపల్లి జయరామ్ టిడిపి అభ్యర్థిగా సమీప కాంగ్రెస్ అభ్యర్థి శమంతమనిపై విజయం సాధించగా తిరిగి ఎన్టీఆర్ సిఎం అయ్యారు. 1989లో కాంగ్రెస్ అభ్యర్థిగా శమంతకమణి సమీప టిడిపి అభ్యర్థి జయరామ్‌పై విజయం సాధించగా మర్రి చెన్నారెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. 1994లో టిడిపి అభ్యర్థి కొత్తపల్లి జయరామ్ సమీప కాంగ్రెస్ అభ్యర్థి శమంతకమణిపై విజయం సాధించగా ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అయ్యారు. 1999లో టిడిపి తరపున కొత్తపల్లి జయరామ్ కాంగ్రెస్ అభ్యర్థి సాయిరామ్‌పై విజయం సాధించగా చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యారు. 2004లో డాక్టర్ శైలజనాథ్ కాంగ్రెస్ అభ్యర్థిగా సమీప టిడిపి అభ్యర్థి శమంతకమణిపై విజయం సాధించగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు 2009లో తిరిగి శైలజానాథ్ సమీప టిడిపి అభ్యర్థి శమంతకమణిపై విజయం సాధించగా రాజశేఖర్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి అయ్యారు. 2014లో టిడిపి అభ్యర్థిగా యామినీబాల సమీప వైసిపి అభ్యర్థి జొన్నలగడ్డ పద్మావతిపై విజయం సాధించగా టిడిపి అధికారంలోకి వచ్చి చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యారు. 2019లో వైసిపి అభ్యర్థి జొన్నలగడ్డ పద్మావతి బండారు శ్రావణిపై విజయం సాధించగా రాష్ట్రంలో ఆ పార్టీ అధినేత జగన్ సిఎం అయ్యారు. ప్రస్తుతం టిడిపి అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ వైసిపి అభ్యర్థి వీరాంజనేయులుపై విజయం సాధించగా రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి వచ్చి చంద్రబాబు మరోసారి ముఖ్యమంత్రి కాబోతున్నారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న శింగనమల సెంటిమెంట్ 2024 ఎన్నికల్లో కొనసాగిందని చెప్పవచ్చు.

శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ విజయం



నార్పలలో టపాసులు పేలుస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు



కొత్తపల్లిలో గుమిగూడిన జనం

టి.కొత్తపల్లిలో టిడిపి, వైసిపి వర్గీయుల ఘర్షణ

ఏడుగురికి గాయాలు



కొత్తపల్లిలో గాయపడిన వారు

గుత్తి : మండలంలోని టి.కొత్తపల్లి గ్రామంలో మంగళవారం టిడిపి, వైసిపి వర్గీల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ జరుగుతున్న సందర్భంగా టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరామ్ విజయం సాధించడంతో గ్రామానికి చెందిన టిడిపి వర్గీయులు సంబరాలు చేసుకున్నారు. ఇందులో భాగంగా ద్విచక్ర వాహనాల్లో కేకలు పెడుతూ గ్రామంలో కలియ తిరిగారు. బాణాసంచా కాల్చే సమయంలో వైసిపి, టిడిపి వర్గీయుల మధ్య వాదన చోటు చేసుకుంది. ఒకరినొకరు తోసుకుంటూ కర్రలు, రాళ్లతో పరస్పరం దాడులకు పాల్పడ్డారు. ప్రమాదంలో వైసిపి వర్గీయులు నీలకంఠేశ్వర, ఈశ్వరయ్య, చంద్ర, సురేష్, టిడిపి వర్గీయులు ఆంజనేయులు, ఓబన్న, పెద్దయ్యకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం వారిని అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆసుపత్రికి టిడిపి, వైసిపి కి చెందిన వర్గీయులు పెద్ద ఎత్తున చేరుకోవడంతో అక్కడ ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ బి.నబిరసూల్ సిబ్బందితో కలిసి టిడిపి, వైసిపి వర్గీయులను చెదరగొట్టారు.

చింతకుంటలో..



చింతకుంటలో గాపయడిన వారు

పుట్లూరు : మండలంలోని చింతకుంట గ్రామంలో టిడిపి నాయకుడు, సర్పంచి శివరామయ్య మరి కొంతమంది వ్యక్తులపై వైసిపి వర్గీయులు దాడి చేశారు. ఈ దాడిలో పలువురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని వెంటనే తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయాలైన వారిలో సర్పంచి శివరామయ్య కొడుకు, కొంతమంది మహిళలు ఉన్నట్లు శివరామయ్య తెలిపారు. ఓటమిని జీర్ణించుకోలేక దాడికి పాల్పడ్డారని వాపోయారు.

తాడిపత్రి నియోజకవర్గ చరిత్రలో

అత్యధిక మెజారిటీ

29,073 ఆధిక్యంతో జెసి అస్మిత్‌రెడ్డి గెలుపు

ప్రజాశక్తి-తాడిపత్రి



తాడిపత్రి నియోజకవర్గ చరిత్రలో అత్యధిక మెజారిటీ సాధించి గెలుపొంది జెసి అస్మిత్‌రెడ్డి చరిత్ర సృష్టించారు. 29,073 ఓట్ల మెజార్టీతో జెసి అస్మిత్‌రెడ్డి విజయకేతనం ఎగురవేశారు. 2019 ఎన్నికల్లో జెసి కుటుంబం సెంటిమెంట్ ఫలితంగా ఓటమి చవిచూసిన అస్మిత్‌రెడ్డి 2024 ఎన్నికల్లో ఘన విజయం సాధించి తాడిపత్రి నియోజకవర్గం జెసి కుటుంబం అడ్డాగా మార్చినట్లు అయింది. జెసి కుటుంబంలో మొదటిసారి ప్రత్యక్ష ఎన్నికల్లో పాల్గొని ఓడిపోవడం సెంటిమెంట్. గతంలో జెసి కుటుంబం తరపున పోటీ చేసిన వారు కూడా ప్రత్యక్ష ఎన్నికల్లో మొదటిసారి ఓటు చేసిన వారే. అనంతరం వరస విజయాలతో 1983 నుంచి 2019 ఎన్నికల మినహా తాడిపత్రి నియోజకవర్గంలో జెసి కుటుంబం తరపున విజయం సొంతం చేసుకుంటూ వచ్చారు. తాడిపత్రి నియోజకవర్గంలో 20 రౌండ్లు, బ్యాలెట్ ఓటింగ్ ఏకధాటిగా టిడిపిని వరిస్తూ 29073 ఓట్లు మెజారిటీ లభించాయి. మొదటి రౌండ్ మినహా ఏ రౌండ్‌లోనూ వైసిపి గట్టి పోటీ ఇవ్వలేకపోయింది. పెద్దవడుగూరు మండలం, నియోజకవర్గ రూరల్ ప్రాంతంలో వైసీపీకి అండగా నిలుస్తోందని భావించినా ఓటర్లు మాత్రం ఆదరించలేదు. ఏదిఏమైనా నియోజకవర్గంలోని ఓటర్లందరూ మరోమారు జెసి కుటుంబ సభ్యుడు అస్మిత్ రెడ్డిని ఆదరించి అత్యధిక మెజారిటీతో గెలిపించారు.

సెంటిమెంట్‌ను బద్దలు కొట్టిన 'కేశవ్'

21,704 ఓట్ల మెజార్టీతో పయ్యావుల గెలుపు

ప్రజాశక్తి-వజ్రకరూరు

ఇప్పటి వరకు జరిగిన చాలా సార్వత్రిక ఎన్నికల్లో ఉన్న సెంటిమెంటును బద్దలు కొట్టి పయ్యావుల కేశవ్ ఉరవకొండ నియోజకవర్గంలో చరిత్ర సృష్టించాడు. ఒక్క 1994లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఉరవకొండ నియోజకవర్గ కేంద్రంతో పాటు రాష్ట్రంలో కూడా టిడిపి గెలిచింది. అప్పటి నుంచి ఇప్పటి వరకూ దాదాపు 30 సంవత్సరాల పాటు ఉరవకొండలో ఏపార్టీ అభ్యర్థి అయితే గెలుస్తాడో రాష్ట్రంలో ఆ పార్టీ ఓడిపోయే సెంటిమెంట్ కొనసాగింది. అయితే ఈసారి మాత్రం పయ్యావుల సోదరుల రాజకీయ చతురత, రాజనీతితో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వర్‌రెడ్డిపై ఇప్పటి వరకూ ఎప్పుడూ రాని భారీ మెజార్టీతో గెలుపొందారు. పయ్యావుల కేశవ్‌కు 1,02,046 ఓట్లు రాగా, వైసిపి అభ్యర్థి విశ్వేశ్వర్‌రెడ్డికి 80,342 ఓట్లు వచ్చాయి. పయ్యావుల కేశవ్ 21,704 ఓట్లు మెజార్టీతో గెలుపొందాడు. పయ్యావుల కేశవ్ గెలుపొందడంతో ఉరవకొండ నియోజకవర్గం పరిధిలోని విడపనకల్, ఉరవకొండ, వజ్రకరూరు, కూడేరు, బెలుగుప్ప మండలాల వ్యాప్తంగా టిడిపి, జనసేన, బిజెపి నాయకులు బాణాసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. కాగా గెలుపొందిన తర్వాత పయ్యావుల కేశవ్ జాయింట్ కలెక్టర్, రిటర్నింగ్ అధికారి కేతన్‌గార్గ్ నుంచి డిక్లరేషన్ ఫారం అందుకున్నారు.

పెద్దవడుగూరులో నిర్మానుష్యం

పెద్దవడుగూరు : సార్వత్రిక ఎన్నికల లెక్కింపు సందర్భంగా మంగళవారం పెద్దవడుగూరులో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ప్రధాన రహదారిలో సీఐ రోషన్, ఎస్సై ముత్యాలశ్రీనివాసులు, ఏఎస్సైలు మధుసూదనరావు, నారాయణనాయక్, జమెదారు మోహన్ నాగేశ్వరరావు తదితరులు పోలీసు సిబ్బంది పాల్గొని ప్రధాన రహదారితోపాటు పలు కాలనీల్లో పర్యటించి ఎలాంటి సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు. ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా హెటళ్లు, పలు వ్యాపార దుకాణాలు, మూసివేయడం, ప్రధాన రహదారిలో ప్రజలు ఎవరూ తిరగక నిర్మానుష్యంగా మారింది.



శింగనమల మండలం పెరవలిలో పూజలు చేస్తున్న టిడిపి నాయకులు


తెలుగు తమ్ముళ్ల సంబరాలు

ప్రజాశక్తి-శింగనమల

బండారు శ్రావణిశ్రీ ఎమ్మెల్యేగా గెలవడంతో పాటు రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావడంతో యువనేత పుచ్చకాయల రాము ఆధ్వర్యంలో మండల పరిధిలోని పెరవలి గ్రామంలో తెలుగు తమ్ముళ్ల సంబరాలు చేసుకున్నారు. ముందుగా గ్రామంలోని వరదరాజు స్వామి ఆలయానికి వెళ్లి పూజలు చేశారు. అనంతరం కేకు కోసి.. టపాసులు పేల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి ని కోరిన ప్రజలు టీడీపీకి పట్టం కట్టారన్నారు. ప్రజల నమ్మకాన్ని చంద్రబాబు వమ్ము చేయారన్నారు. అలాగే నిత్యం ప్రజల కోసం పని చేసిన బండారు శ్రావణిశ్రీ సమస్యల పరిష్కానికి ముందుంటుందని తెలిపారు. టీడీపీకి ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : తాడిపత్రి నియోజకవర్గంతోపాటు జిల్లాలోని 14 నియోజకవర్గాలు, రాష్ట్రంలో టిడిపి అత్యధిక స్థానాలను కైవసం చేసుకోవడంపై పెద్దవడుగూరు మండల వ్యాప్తంగా ఆపార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. టిడిపి అభ్యర్థులు గెలుపు పట్ల హర్షం వ్యక్తంచేస్తూ పెద్దవడుగూరు తదితర గ్రామాల్లో టపాసులు, కాల్చుతూ కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. పెద్దవడుగూరు మండల నాయకులు కొండూరు కేశవరెడ్డి, ఆవులాంపల్లి కేశవరెడ్డి, నాగేశ్వరరెడ్డి, తిలక్ రెడ్డి చిరంజీవులు, రాము తదితరులు జెసి అస్మిత్‌రెడ్డిని కలిసి అభినందించారు.

పామిడి : ఎపి సార్వత్రిక ఎన్నికల్లో గుంతకల్లు ఎన్‌డిఎ కూటమి అభ్యర్థి గుమ్మనూరు జయరామ్ విజయం సాధించడంతో మండలంలో తెలుగు తమ్ముళ్లు టపాసులు పేలుస్తూ సంబరాలు చేసుకున్నారు. నిషేధాజ్ఞలు విధించినప్పటికీ లెక్కజేయక పార్టీ నాయకులు, కార్యకర్తలు బాణాసంచా కాల్చారు. బైకు ర్యాలీ చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి నుంచి ఎమ్మెల్యేగా గుమ్మనూరు జయరామ్ డిక్లరేషన్ ఫారం అందుకుని భారీ కాన్వాయ్‌తో పామిడికి చేరుకోవడంతో పార్టీ శ్రేణులు, ప్రజలు భారీ స్వాగతం పలికారు. అనంతరం అభివాదం చేస్తూ ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




నార్పల మండలంలో సంబరాలు చేసుకుంటున్న టిడిపి నాయకులు



హిందూపురం ఎంపీగా డిక్లరేషన్ ఫారం అందుకుంటున్న పార్థసారథి


అనంతపురం ఎంపీగా డిక్లరేషన్ ఫారం అందుకుంటున్న అంబికా లక్ష్మీనారాయణ


రాప్తాడు ఎమ్మెల్యేగా డిక్లరేషన్ ఫారం అందుకుంటున్న పరిటాల సునీత


డిక్లరేషన్ తీసుకున్న అభ్యర్థులు


రాయదుర్గం ఎమ్మెల్యేగా డిక్లరేషన్ ఫారం అందుకుంటున్న కాలవ శ్రీనివాసులు


అనంతపురం ఎమ్మెల్యేగా డిక్లరేషన్ ఫారం అందుకుంటున్న దగ్గుపాటి ప్రసాద్



ఉరవకొండ ఎమ్మెల్యేగా డిక్లరేషన్ ఫారం అందుకుంటున్న పయ్యావుల కేశవ్


గుంతకల్లు ఎమ్మెల్యేగా డిక్లరేషన్ ఫారం అందుకుంటున్న గుమ్మనూరు జయరామ్



కళ్యాణదుర్గం ఎమ్మెల్యేగా డిక్లరేషన్ ఫారం అందుకుంటున్న అమిలినేని సురేంద్రబాబు


ధర్మవరం ఎమ్మెల్యేగా డిక్లరేషన్ ఫారం అందుకుంటున్న సత్యకుమార్


కదిరి ఎమ్మెల్యేగా డిక్లరేషన్ ఫారం అందుకుంటున్న కందికుంట వెంకటప్రసాద్


పెనుకొండ ఎమ్మెల్యేగా డిక్లరేషన్ ఫారం అందుకుంటున్న సవితమ్మ


డిక్లరేషన్ ఫారం చూపుతున్న పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర



బాలకృష్ణ తరపున ఆర్ఓతో డిక్లరేషన్ అందుకుంటున్న తెలుగు తమ్ముళ్లు


కౌంటింగ్ కేంద్రం వద్ద తాడిపత్రి ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి



అనంతపురం జెఎన్‌టియు ఓట్ల లెక్కింపును పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్


హిందూపులో ప్రజలకు అభివాదం చేస్తున్న హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ